కథానిక

# మేనమరదలు

## వడ్లపట్ల దయానందం

మేనరికపు బాపతు మరదళ్ళపై అతిగా చనువు తీసుకుని సంచరించే మేనబావలు కథల్లోను, సినిమాల్లోనూ తరచు దర్శనమిస్తూంటారు.

"ఇలా నీతో మాట్లాడుతూంటే చూచే వాళ్ళంతా ఏమనుకుంటారు?" అంటూ నిలువునా ప్రశ్నించే మేనమరదలు— ఆట్టికథ గాని, సినిమాలు గాని చూస్తే ఎంతబావుండును అని విచారించటం కంటె వేరు గత్యంతరంలేదు.

"బావలేనిదే బ్రతుకజాలా" అన్న చరణాన్ని ఏనాటికైనా ఆలాపించక పోతుందా? అన్న తుది ఆశతోను "తప్పక ఆలాపిస్తుంది లెమ్మన్న" గట్టి నమ్మకంతోనూ నిమిషాలు, సెకండ్లతో కూడుకున్న కాలాన్ని—నెలలు, సంవత్సరాలుగా, ఎదుర్కొంటూ భారంగా కాలంగడపటంకంటే వేరుమార్గం గోచరించటం లేదు.

బావా మరదళ్ళ హృదయాలు లతలా, ఒకదానితో ఒకటి గాఢంగా పెనవేసుకుపోయి కమ్మని పూలుపూచేదెప్పుడా? అని కంటున్న కలలన్నీ కళ్ళముందు, అల్లంతదూరాన బొమ్మల్లా మెదలటం తప్పితే వాస్తవికానికి అందివచ్చే ఆశ కనుచూపు మేరలో కానరావటంలేదు.

"ఆకుల్లో ఆకునైపోతా; పూవుల్లో పూవునై పోతా" నంటూ విరహంలో వొళ్ళు తెలియక స్వేచ్ఛగా ప్రేమగీతికలు పాడుకుంటూ, ఇష్ట మొచ్చినట్లు విహరించడానికి చుట్టుపట్లెక్కడా పుష్పోద్యానవనాలు లేకపోయినా వెన్నెల రాత్రుళ్ళ బోట్లుషికార్లు సంఘస్థితికి సరిపడక పోయినా, అధమపక్షం — నాలుగు గోడలమధ్యనైనా స్వర్గానికొక నకలు సృష్టించుకోవచ్చును లెమ్మన్న ఆశ ఏనాడో నిర్జీవ అవతారందాల్చి హృదయంలో ఒకమూల అట్లాపడి ఉండిపోయింది. దానికి జీవంపోయడానికి మరదలు ససేమిరా కొరకరానికొయ్యయి కూర్చుంది.

ఆ రోజున మేనమరదలితో మాట్లాడుతూ అన్నా (ఇక్కడ రూపు వర్ణన అవశ్యం అనుకుంటా) ఆకుపచ్చని జార్జెట్ చీర, వైట్ పాప్లిన్ జాకెట్ వేసుకుని నుదురుమీ పడుతూన్న నొక్కులజుత్తుతో అచ్చంగా ఆకుపచ్చని ఆకులమధ్య అప్పుడే విచ్చుకుంటూన్న మల్లెమొగ్గలాఉంది. అప్పుడే అన్నా...

"రాధా, నువ్వు నిజంగా మృదువైన మల్లెపువ్వులా ఉన్నావు సుమా"అని.

"ఇంకా నయం. తీయని చిలుకడ దుంపలా ఉన్నానన్నావుకాదు. ధోరణి చాలించోయ్. నాకు మండిందంటే మామయ్యతో చెప్పేయగలను"అంది నిర్మొఖమాటంగా.

పెసరకాయల్లాంటి సన్నని పెదాలమధ్య వెలువడ్డ, ఆ ముతకమాటలకి బహుశా నా హృదయం నొచ్చుకునే ఉంటుంది.

"ఛూ! ఎదుటి హృదయాన్ని అర్థంచేసుకోలేవు"అన్నాను కలువరేకుల్లాంటి కళ్ళవంక నీరసంగా చూస్తూ.

తేలిగ్గా ఒక్క చిరునవ్వు నవ్వింది. సంపెంగ రేఖల్లా చివర వంపులు తేలిన ముక్కు, ముచ్చటగా కదిలింది. రెండుబుగ్గలా రెండు సొట్టలూ గమ్మత్తుగా పడ్డాయి. కొంటె కళ్ళు నావంక చిత్రంగా చూశాయి. మొత్తంమీద ముఖంలో మిస్‌వరల్డ్ కనిపించిందా క్షణంలో. ఫలితంగా ఆవేశంలో తిరిగి ఏదో అనబోయా...

ఇంతలోనే ముఖాన్ని అట్టే సీరియస్‌గా మార్చేసి—

"కాలేజీకెళ్ళడానికి బద్ధకించి మంచమెక్కే నువ్వు, పనికట్టుకుని ఐదుమైళ్ళ దూరం రావడం దేనికి? ఈ శ్రద్ధ చదువుమీదే ఉంటే ఈపాటికి గ్రాడ్యుయేటువై ఉండేవాడివేనా? నువ్వు స్కూలు ఫైనల్ పాస్ అయినప్పుడు ఫోర్తుఫారం పాస్ అయిన నేను, నీతో కలవడానికి కారణం ఏమిటి? ఇప్పటికెన్ని సెప్టెంబర్లు, ఎన్ని మార్చిలు చూచావో అంతేమైనా ఉందా? అసలు రేపు కాలేజీ వదిలాక, ఆ బండిమీదే ఇంటికొచ్చి, మావయ్యతో

చెప్పేస్తాను"అంది ప్రశ్నార్థకపు ధోరణ్ణి కాస్తా చివరికి బెదరింపు ధోరణిలోకి మార్చి.

"సరేలే, నీకోసమేం కాదు వస్తే. ఏదో మావయ్యని చూచిపోదామని వచ్చా"నంటూ అభిమానాన్ని సంరక్షించుకుంటున్న సమయంలో, యమునిలా మావ కాస్తా బీడి తగలేస్తూ బయటనుంచి ప్రత్యక్షమై "ఏరా అబ్బీ! వచ్చి ఎంతసేపయింద" అన్నాడు.

"అబ్బే, నేనిలా వచ్చి కూర్చున్నాను, నువ్విలా వచ్చావు అంతే"అన్నాను ఎందుకైనా మంచిదని డిఫెన్సు చేసుకుంటూ.

చెట్టంత పెరిగినవాణ్ణి, అందులోనూ ఈడైన అమ్మాయి ముందుపెట్టి, ఎంత మేనమామైతే మటుకు, అంత నిర్లక్ష్యంగా సంబోధించినందుకు, మొదటకాస్త, కష్టంగానే తోచింది. అయినా పెద్దరికపు గౌరవభావం ముందు, ఆ కష్టం అట్టేకాలం నిలవక, ఇట్టేమంచులా కరిగిపోయింది.

"ఈసారైనా బాగారాశావా?" అన్నాడు బీడీపారేసి, అమ్మాయి అందించిన మంచినీటిని పుక్కిలించి ఉమ్మేస్తూ.

"ఊఁ బాగానే రాశా" అన్నా.

"అసలు బావ బాగా వ్రాయందెపుడు?" అంది మరదలు తాటాకుల ధోరణిలో.

ఎత్తుపళ్ళన్నీ బయటపడేసి ఎ. హె.. హె.. హె అన్నాడు పురంద్రయ్య మావ.

"సరేలే నాకు కాస్త టీ పెట్టివ్వు వెళ్ళిపోతా" నన్నా మరదలి నుద్దేశించి.

"బావ కేదైనా చేసి పెట్టగూడదటే"అన్నాడు పురంద్రయ్య మావ.

"ఊహూ నాకేం అవసరంలా టీచాల్లే" అన్నా, టెట్టు నిలుపుకుంటూ.

"టీ తప్ప ఇంకేమన్నా కావాలన్నా ఇక్కడెవ్వరూ చేసి పెట్టబోవటం లేదులే"అంటూ నా వంక కొంటెగాచూసి, వయ్యారంగా, వాలుజడల బందులు సవరించుకుంటూ వంటగదిలోకి నడచింది మేనమరదలు రాధ.

"నువ్వంటే దీనికి మహలోకువరా" అన్నాడు మావయ్య. నా ముఖంలోకి సూటిగా నవ్వుతూ.

తెల్లమొఖంతో నవ్వెయ్యడంకంటే వేరు సమాధానం దొరకలా నాకు. మళ్ళా ఓ బీడీ అంటించి, గట్టిగా ఓదమ్ములాగి "ఇంతకీ ఏంపని మీద వచ్చినట్టు" అడిగాడు.

హఠాత్తుగా నా గుండెల్లో ఏదో గిజ, గిజ, కొట్టుకుంది. అప్రయత్నంగా ముఖాన్ని చెమట అవతరించింది.

ఏం సమాధానం చెప్పాలి అయినా అర్థంలేకుండా నిలువునా, ఎందుకొచ్చినట్లు, అని కొట్టొచ్చినట్లడగడం ఏమిటి?

"అబ్బే నోట్సుంటేను, ఇచ్చిపోదామనివచ్చా" నన్నా. ఎలా ఓలా నాలుక తడి చేసుకుంటూ.

మళ్ళా బీడీ దమ్ములాగి "దీని గ్రూపు వేరనుకుంటాగా" అన్నాడు.

బోనులోని సాక్షిగా తయారయ్యాను పేగులు తీసే ప్లీడరులా కన్పించాడు మావయ్య. సమాధానం కోసం ఆలోచిస్తూ, నాలుగో కళాసులో చదువుకి మూతి బిగించిన మావయ్యకి గ్రూపుల్లో తేడాలు కూడా ఎలా తెల్సినయ్యా అనుకుని ఆశ్చర్యపోయా.

మావ ఇక మాట్లాడక బీడీ పీల్చుడు కార్యక్రమంలో మునిగుండిపోయాడు-రాధ టీ తయారింపులో వంటింట్లో తిప్పలు పడుతోంది. నా ఆలోచనలన్నీ అకస్మాత్తుగా ఏ పది సంవత్సరాల వెనక్కిపోయి నిలిచినయ్.

జగన్నాటకంలో అత్తయ్య పాత్ర రంగంనుంచి నిష్క్రమించి దాదాపు పది సంవత్సరాలు కావస్తూంది. అప్పటికి రాధ ఉత్త చిన్నపిల్ల-ఆ మరునాడిక అత్తయ్య ఈ లోకంమీద కోపించిపోతుందనగా, ఈ రోజున అమ్మా నాన్నలతో కలసి అత్తయ్యని చూడడానికి వచ్చాను. అప్పటికి సెకండ్ ఫారమనుకుంటా చదువుతున్న గుర్తు. ఆ కాలంలో, రాధా, నేనూ రాధకృష్ణులులా, తరచూ జట్టాపట్టా లేసుకు తిరిగేవాళ్ళం.

అత్తయ్య పోయేముందు ఊరికినే పోక, తుది కోర్కె నొకదాన్ని కోరుతుంది ఆత్మశాంతికిగాను, తన కోర్కెను నెనవేర్చమని, నాన్ననీ మావయ్యనీ కూడా అభ్యర్థించింది. అపుడు రాధ మావయ్య వడిలోనూ, నేను నాన్నప్రక్కనా కూర్చున్నాం. అత్తయ్య కోర్కెను విన్న రాధ "ఊహు... నేను 'బావ'ని చేసుకోను నాన్నా, మరి ఎప్పుడూ కొడతాడు" అంది బుంగమూతి పెట్టి. అంతటి నీరస

స్థితిలోనూ అత్తయ్య పక్కన నవ్వి, ప్రాణం కాస్తా విడిచేసింది.

ఓ సంవత్సరం పోయినతరువాత, రాధా, మావయ్యా మా యింటి కొచ్చినప్పుడు, చిన్న తనంలో తమాషా కడిగాను-"ఇద్దరం పెళ్ళి చేసు కొందామా" అని.

"ఏమో బాబూ, నువ్వెప్పుడూ కొడతావుగా మరి" అంది మళ్ళా.

చిన్నతనంలో రాధంటే నాకు మహా లోకు వగా ఉండేది. నాలుగు, నాలుగులెంత? అంటే తడుంకోకుండా పద్ధెనిమి దనేది. ఏయ్ మొద్దూ-అంటూ చళ్ళున చరిచేవాడిని. అటువంటి రాధ ఇపుడు ఎదురు తాటాకులు కడుతుందంటే, ఏమీ ఎరగనట్టు పోయేకాలం మహిమ తెలుసుకోడాని కెవరితరం? అనిపిస్తుంది.

అప్పట్లో నాన్న అడిగాడట మామయ్యని—"తల్లిలేనిపిల్ల చూచే దిక్కెవరు పోనీ మా యింట్లోనే ఉండి చదువుకుంటుంది లేమ్మని.

"అది నాకళ్ళ ముందు లేకుండా నే బ్రతగ్గ లనా బావా" అన్నాడట మామయ్య. మాటల సందర్భంలో నాయనమ్మవల్ల తెలిసిన ఇన్‌ఫర్ మేషన్ అది.

నేను ఫోర్తుఫారం చదువుతూన్నపుడే "మూడు ముళ్ళూపడి, నే కడుపున కాయొకటికాస్తే చూచి పోతామనుందిరా" అంటూ కలవరిస్తూనే పాపం నే కాలేజీలో కాలెట్టేసరికే ఇహం మీద కోపగించి పయనించింది నాయనమ్మ.

"టీ తీసుకోరా ముకుందం" అన్న మామయ్య మాటకి ఉలిక్కిపడి, ఆలోచనల్నుంచి తేరుకు ప్రక్కకి చూచా.

మౌనంగా టీగ్లాసందించింది రాధ.

"అమ్మాయి మూగదేవిటి మావయ్యా" అన్న కాస్త తెలివితేటలు ప్రదర్శిస్తూ. "ముందోహసారి పిలిచా, తమరు వినిపించుకోందే క్రొత్తగా చెము డొకటొచ్చి పడిందని తెలిస్తే, నేనే కాస్త గట్టిగా పిలిచేదాన్ని" అంది.

మళ్ళా ఓసారి మావ నవ్వేశాడు, చప్పగా చల్లారిన, ఇత్తడి చెంబుడు టీని, మంచినీళ్ళ ప్రాయంగా గటగట త్రాగేసి, మీసాలను తుండుతో వత్తుకుంటూ.

విధిగా నా తెలివితేటల్ని కట్టిపెట్టేయాల్సొచ్చి మౌనముద్రతాల్చా టీ పీల్చుతూ.

ఒకనెల రోజులు గడిచిన తర్వాత.

ఆరోజున మావయ్య, అనుకోకుండా ప్రత్య క్షమై చావు కబురు కాస్తా జారవిడిచాడు. అమ్మాయి పెళ్ళి వచ్చే మాసంలోనే ఆరోతారీ కునని.

"కుర్రాడి వివరాలేమిటి?" అన్న ప్రశ్నకంటే నాన్న మరేం మాట్లాడలా.

"బి. ఏ. చదువుతున్నాట్ట చాల బుద్ధిమంతు డట. పెద్దలందు భక్తి మరీ మెండట ఇల్లరికానికి అటువంటి వాడన్ని విధాలా బావుంటాడని" అంటూ నాన్చుతూ ఆగాడు మావయ్య.

"సరే మంచిదేకా" అన్నాడు నాన్న.

అమ్మ కూడా ఏమీ మాట్లాడలా.

మావయ్య, సెలవు తీసుకు వెళ్ళిపోయాడు.

నాన్న అన్నాడు అమ్మతో, "బయటికి పోవ డమే మనకి మంచిది లెద్దూ. ఇంతకంటే మంచిదే మనం తెచ్చుకోవచ్చు" అని అమ్మ అంది సమా ధానంగా.

"అయినా, అదసలువట్టి గద్దరిగడుగ్గాయి-పీడేమో వట్టి మెతకవెధవయ్యె. ఒకవేళ చేసు కున్నా, ఇద్దరికీ అతికేద్వదని, నాకు లోపల వుండేది. అయినా బయటికనడం ఎందుకని, అనే దాన్ని కాదు-పోనీండి పీడ విరగడైపోయింది"

పీడ విరగడవ్వడం మాటెలా ఉన్నా-నాకు మాత్రం పిచ్చెత్తినట్లయింది. ఆ రాత్రికి యెంత సేపటికి నిద్ర పరించేదికాదు. ఆఖరుకు విసుగెత్తి సూటిగా ప్రశ్నించుకున్నా.

"రాధని, నిజంగా ప్రేమించానా-లేక ప్రేమిం చానని భ్రమించానా?" అని.

నిజంగా ప్రేమించినట్లయితే మరి కళ్ళముందు చీకట్లు క్రమ్మటం కాళ్ళక్రింద భూమి కంపించటం గుండెలు బ్రద్దలుకావడం, బుర్రలో, విమానాలు, రైళ్ళుగట్రా పరిగెట్టటం ఇత్యాది వికారపు చేష్టలు ఏమీ కలగటంలేదే? బహుశా ప్రేమించానని, పొరపడ్డానేమో.

పోనిద్దూ-వెధవరాధ ... అదికాకపోతే, దాని తలదన్నిందింకొకతె అనుకున్నా, ఆఖరుకు కళ్ళు మూస్తూ.

★